క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రావూరి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశానికి నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ జనార్దన్ కోరారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కంభం: మండలంలోని ఎల్.కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు ఎ.సరోజ తెలుగు భాషాభివృద్ధి కోసం బాలల సంఘాలను ఏర్పాటు చేసి ఆయా సంఘాలకు గ్రంథాలయ వారధులని నామకరణం చేస్తూ సంఘం ద్వారా పుస్తకాలను చదివించడం, పుస్తక సమీక్షలు రాయించడం, కథల పోటీలు నిర్వహించడం వంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పౌర సేవలు పెంచాలి

పుల్లలచెరువు: గ్రామ సచివాలయాల్లో పౌర సేవలు పెంచేలా కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన సేవలు పెంచేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న నీటి ఎద్దడిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్‌డీజీ సర్వేపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దీనిపై జిల్లా అధికారులు సీరియస్‌గా ఉన్నారని, సర్వే నూరు శాతం చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా రామకృష్ణ జయంతి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశిరెడ్డి నాయన నగర్ రామకృష్ణ ధ్యాన మందిరంలో మంగళవారం రామకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన సేవా సమితి అధ్యక్షుడు పూనూరు హనుమంతారెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సి ఉందన్నారు. రామకృష్ణ పరమహంస బోధనలు సమాజంలోని మార్పులకు ఎంతగానో ఉపయోగడ్డాయన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి, ధ్యానమందిరం కమిటీ సభ్యులు పోలయ్య, రాజేశ్వరి, ఈదుల వెంకటరామిరెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

త్రిపురాంతకం: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి కె.నీరజ సూచించారు. మండలంలోని సోమేపల్లిలో పత్తి పంటను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చే పురుగులైన పేనుబంక, పచ్చదోమ, తామర పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పసుపు రంగు డబ్బాలకు జిగురు పూసి ఉంచితే ఆకర్షించి జిగురుకు అతుకుంటాయన్నారు. గులాబీ రంగు పురుగును గుర్తించేందుకు ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షణ బుట్టలు అమర్చాలని సూచించారు.

రక్తదానంతో ప్రాణదానం

మార్కాపురం: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, జార్జి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజాజయరావులు కోరారు. మంగళవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య వంతులు ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానంపై అపోహలు వద్దన్నారు. గర్భిణులు, రోడ్డు ప్రమాద బాధితులకు రక్తం అవసరం ఉంటుందన్నారు. 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఓడీలు అశోక్‌బాబు, సునీత, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ శివ పాల్గొన్నారు.

1న శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

గిద్దలూరు రూరల్: మార్చి ఒకటో తేదీన శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్నట్లు స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ శనగలు కొనుగోలు చేయనున్నట్లు ఏఓ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ ధర రూ.4500 ఉండగా ప్రభుత్వం రైతులకు మద్దతు ధరగా రూ.5.335 ప్రకారం శనగలు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. శనగ పంట వేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న తర్వాత రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి శనగలు కొనుగోలుకు రిజిస్టర్ చేసుకోవాలని ఏఓ కోరారు.



పొదిలి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు



కాలనీ ముఖద్వారం

వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

- ఉగాదికి గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు పూర్తి
- మార్కాపురం నియోజకవర్గానికి మంజూరైన ఇళ్లు 12,460
- పూర్తి అయిన ఇళ్లు 1306

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
మార్కాపురం	1406	237
మార్కాపురం అర్బన్	6342	254
కొనకనమిట్ల	678	237
పొదిలి	2471	245
పొదిలి అర్బన్	260	41
తర్లుపాడు	1303	301

తర్లుపాడు: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న గృహాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ఇప్పుడిప్పుడే వారి కలలు నిజమవుతున్నాయి. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి టౌన్, పొదిలి రూరల్ మండలాల్లో మొత్తం 12,460 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో సుమారు 1306 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా వచ్చే నెలలో ఉగాది సందర్భంగా గృహ ప్రవేశాలు చేయాలని అధికారులు లబ్ధిదారులను సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఖర్చు చేస్తోంది. ఖరీదైన స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లు ప్రతి గ్రామంలో ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. జగనన్న కాలనీలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇంటి నిర్మాణానికి అవసరమైతే మరో 35 వేల రూపాయలను బ్యాంక్‌లు రుణాలుగా అందిస్తున్నాయి. మార్కాపురం పట్టణ శివారులోని ఇడుపూరు వద్ద, పొదిలి వద్ద నిర్మిస్తున్న జగనన్న లేఔట్లు ప్రత్యేక టౌన్‌షిప్‌లుగా రూపుదిద్దుకుంటున్నాయి.



తర్లుపాడులో నిర్మాణంలో ఉన్న గృహాలు

చాలా సంతోషంగా ఉంది



మాది పొదిలి మండలం మాదాలవారిపాలెం పంచాయతీలోని రామాయణకండ్రిక గ్రామం. రాష్ట్ర ప్రభుత్వం సాకారంతో జగనన్న లేఔట్‌లో ఇంటిని నిర్మించుకున్నాం. 1.50 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. గృహ నిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది సాకారంతో ఇల్లు కట్టుకున్నాం. బిల్లులు సకాలంలో వచ్చాయి. మంచి ఇల్లు కట్టుకున్నామన్న సంతృప్తి ఉంది.

– వెంకట్రావు, నందిని, దంపతులు

ఉగాదికి గృహ ప్రవేశాలు

మార్కాపురం నియోజకవర్గంలో సుమారు 1306 గృహాలు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు అన్ని విధాలుగా మా శాఖ తరఫున సహకరించాం. ఉగాదికి గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదారులు నిర్ణయించుకున్నారు. వివిధ దశల్లో ఉన్న గృహాలు కూడా త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరుతున్నాం.



– పవన్‌కుమార్, హౌసింగ్ డీఈ, మార్కాపురం

సంక్షిప్తంగా

ఎస్సీలకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్

త్రిపురాంతకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సముచిత స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ పేర్కొన్నారు. రాప్తాడు నుంచి తాడేపల్లి వరకు పాదయాత్రగా బయల్దేరిన ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు త్రిపురాంతకంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి సంక్షేమ పాలన అందిస్తున్న ప్రజానాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందుకే ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతు పలకాలని సాయికృష్ణ కోరారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి ఆర్.పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం, నక్కా చిన్నత్రిపురారెడ్డి ఉన్నారు.

పారిశుధ్య పనుల్లో భాగస్వాములు కావాలి

దొనకొండ: గ్రామాల్లోని పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి సూచించారు. స్థానిక పంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య డ్రైడే కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి గ్రామస్తులకు పారిశుధ్యం గురించి అవగాహన కల్పించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైడే కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉన్న తొట్లను శుభ్రం చేసుకోవాలన్నారు. చెత్తా చెదారం డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. రోడ్ల వెంట వీధుల్లో చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తికి సూచించారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, వైస్ సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, మండల విస్తరణాధికారి ఎస్.డేవిడ్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

త్రిపురాంతకం: మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు ద్వారా అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఎంఈఓ మల్లికార్జుననాయక్ మంగళవారం పరిశీలించారు. గొల్లవాండ్లపల్లి ఎంపీపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు రికార్డులు, 3,4,5 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. గదుల నిర్మాణం పనుల్లో నాణ్యమైన వస్తువులు ఉపయోగించాలని సూచించారు. ఎస్ఎస్ఏ ఇంజినీర్ మహేష్, హెచ్ఎం రాజశేఖర్, సర్పంచ్ రంగబాబు, పాఠశాల చైర్మన్ వీరనారాయణ పాల్గొన్నారు.

25న ఆ వాహనాలకు వేలం

గిద్దలూరు రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గిద్దలూరు పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 25వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు స్థానిక సెబ్ సీఐ అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో పట్టుబడిన మొత్తం 12 వాహనాలను ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

మార్కాపురం టౌన్: తమపై టార్గెట్ పేరుతో ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని తపాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు సయ్యద్ సుభానీ డిమాండ్ చేశారు. మంగళవారం హెడ్ పోస్టాఫీస్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోస్టల్ ఉద్యోగులు ధర్నా చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి పనుల ప్రారంభం

పొదిలి రూరల్: పొదిలి పట్టణం పొదిలమ్మ దేవాలయంలో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. దాసరి అనంత సుబ్బారావు, రవిబాబుల జ్ఞాపకార్థం వారి ధర్మపత్నిలు జ్యోతి, అనితకుమారిలు దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేసి దేవాలయం ముఖద్వారం, చుట్టూ ప్రహరీ, పొంగలి షెడ్డు నిర్మించారు. మంగళవారం వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, కాటూరి ప్రసాద్, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రక్తహీనత ప్రాబల్యం తగ్గించేందుకే ముక్త్ భారత్

- అనీమియా స్టేట్ ప్రోగ్రాం అధికారి రూపస్‌పాల్

పొదిలి రూరల్: గర్భిణులు, పాఠశాలకు వెళ్లే యుక్త వయసులో ఉన్న రక్తహీనత ప్రాబల్యాన్ని తగించేందుకే ముక్త్ భారత్ పథకం ప్రభుత్వం అమలు చేస్తోందని అనీమియా స్టేట్ ప్రోగ్రాం నోడల్ అధికారి వి.రూపస్‌పాల్ అన్నారు. మంగళవారం పొదిలి నగర పంచాయతీలోని 4,6 సచివాలయాలను అనీమియా స్టేట్ మానిటరింగ్ టీమ్ సందర్శించింది. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బి. మాధవిలత, డీపీహెచ్ఎన్ సుగుణమ్మ, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుగుణకుమార్, పీహెచ్ఎన్ నాగమణి, హెచ్ఈఓ శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు నారు శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, మెరీనా, ఏఎన్ఎంలు మాధవి, విజయ, నాగమ్మ, శరా, శారమ్మ రాణి, సుజాత పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాలను ప్రభుత్వాలే నిర్వహించాలి

పెద్దదోర్నాల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల డానియేల్ మాదిగ కోరారు. ఓ మహిళా మేలుకో కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాలరావుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఆయన పిలుపు ఇచ్చారు. చాట్ల జాన్ మాదిగ, గుడిపాటి బాబుమాదిగ, చాట్ల రమేష్ మాదిగ, యలకపాటి దానం, దర్శనం నాగేష్ మాదిగ, పుష్పాల రాజయ్య, కాకర్ల దానమ్మ, యలకపాటి కొండమ్మ, అచ్చమ్మ, ఎలకపాటి మరియమ్మ, విమలమ్మ, సువార్తమ్మ పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్యలు కోరారు. పట్టణంలోని పలు కళాశాలలు, ఇతర కార్యాలయాల్లో పట్టభద్రులను కలిసి మంగళవారం పట్టభద్రుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందరికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి, సుబ్బయ్యలు మాట్లాడుతూ మంచి వ్యక్తి అందరినీ కలుపుకు వెళ్లే స్వభావం ఉన్న వ్యక్తి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి..అని చెప్పారు. ఆయన్ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- అనుమతి లేకుండా చేపల చెరువుల సాగుపై విచారణ
- ఫిషరీస్ ఏడీ ఉషాకిరణ్, తహసీల్దార్ ఉషారాణి

ముండ్లమూరు: ప్రభుత్వ భూములు ఆక్రమించి చేపల చెరువులు సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఫిషరీస్ ఏడీ ఉషాకిరణ్ హెచ్చరించారు. మండలంలోని ఉమామహేశ్వరపురంలో అక్రమంగా సాగు చేసిన చేపల చెరువులను ఆమె తహసీల్దార్ ఉషారాణితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్వే నంబర్ 404-1, 404-3లలో సుమారు 14 ఎకరాలను అద్దంకికి చెందిన కోయి శ్రీనివాసరావు రీసెటిల్‌మెంట్ పట్టాలు కొనుగోలు చేసి చేపల చెరువులు సాగు చేశారు. పక్కనే ఉన్న వాగు పోరంబోకు భూమిని కొంత ఆక్రమించుకొని ఎలాంటి అనుమతులు లేకుండా చేపల చెరువులు సాగు చేస్తున్నారని కూకట్ల సురేష్ అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చేపల చెరువులు, రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. సర్వే చేసి ఆక్రమణల వివరాలు తెలియజేస్తామని చెప్పారు. అనధికార చేపల చెరువు సాగుపై నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, రీ సర్వే డీటీ రవికాంత్, వీఆర్వో దయానందం, సర్వేయర్ కోటిరెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

తాళ్లూరు: జగనన్న గృహాలు లక్ష్యం మేరకు నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి ఉపేంద్రకుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఉగాది నాటికి పూర్తయ్యేలా చూడాలని కోరారు. పంచాయతీల వారీగా గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ కీర్తి, హౌసింగ్ ఏఈ మనోహర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసుకుంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖలపై ఎంపీపీ సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షే పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. ఈ సందర్భంగా చిన్న కంభం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో జగనన్న కాలనీల్లో నిర్మించే నీటి ట్యాంకుల్లో నాణ్యత పాటించాలన్నారు. తురిమెళ్ల, ఎల్ కోట గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు ఆగి పోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయని, నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు. సమావేశంలో ఎంపీడీఓ నర్సయ్య, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

24 నుంచి ఎస్సీల వర్గీకరణ కోసం పాదయాత్ర

పొదిలి రూరల్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఎస్సీల వర్గీకరణ కోసం పాదయాత్ర చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాశ్ మాదిగ తెలిపారు. మంగళవారం పొదిలి ఏబీఎం హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏబీసీడీల వర్గీకరణకు మాదిగలు ఐక్యంగా కలిసి నడవాలని, అందుకు అందరూ పాదయాత్రలో పాల్గొన్నాలని కోరారు. నరసింహారావు మాదిగ, ఆనంద్ మాదిగ, పందిటి కాశీరావు మాదిగ, రవికుమార్ మాదిగ, సింగపోగు పోలయ్య, చంద్ర, లూకాస్, నెహెమీయా, కోటయ్య, రాజేశ్వరరావు, జోసఫ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేయడం చారిత్రాత్మకం

యర్రగొండపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో 60 శాతం బీసీ వర్గీయులకు కేటాయించడం చారిత్రాత్మకమైన రాజకీయ విధాన నిర్ణయమని ఎంపీపీ, బీసీ సంఘాల నాయకుడు దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలకు 50 శాతానికిపైగా ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడం సామాజిక స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతిలో ప్రతిభ చాటాలి



డ్రిప్ సిస్టాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మిట్టమీదపల్లి మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలోమంగళవారం సాయంత్రం దాత రాఘవరెడ్డి తన సొంత నిధులు రూ. 40 వేలతో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ సిస్టంను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు దాతలు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి నాడు–నేడు ద్వారా కృషి చేస్తున్నారన్నారు. ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి ఇస్తున్నారని, పాఠశాల రూపు రేఖలు మార్చారని, జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు కావాల్సిన అన్ని పుస్తకాలు, బ్యాగ్‌లు, ఇతర సామగ్రి ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: వచ్చే నెల 13న జరిగే తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న శ్యాంప్రసాద్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డిలను మంచి మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ క్యాడర్ మొత్తం కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మార్కాపురం మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సమీక్షించారు. అందరూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మంచి మెజార్టీ తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల వారీగా గ్రాడ్యుయేట్ ఓటరు లిస్టు దగ్గర పెట్టుకుని ఓటర్లు ఎవరైనా ఇతర ప్రాంతాల్లో ఉంటే వారికి ముందుగానే సమాచారం ఇచ్చి పోలింగ్ నాటికి స్వగ్రామాలకు పిలిపించాలన్నారు. బాధ్యతగా పార్టీ నాయకులు పనిచేయాలన్నారు. పోలింగ్ శాతం పెంచాలని, ఓటింగ్‌పై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీ నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, సచివాలయ కన్వీనర్, మరొక గ్రాడ్యుయేట్‌తో కమిటీగా ఏర్పడి ఎన్నికలను పర్యవేక్షించాలన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు మల్లారెడ్డి, వీరయ్య, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, పార్టీ నాయకులు జంకె వెంకట నారాయణరెడ్డి, జె.ఆవులయ్య, ఎల్.శేఖర్, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కును మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. 45 వేల రూపాయల చెక్కును శ్రావణికి అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, కౌన్సిలర్ షెక్షావలి, ఉస్మాన్, కరీంబాషా పాల్గొన్నారు.



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలి

తాళ్లూరు: ప్రజా సమస్యలపై తక్షణ స్పందనతో అధికారులకు ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఎటువంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా క్లుప్తంగా సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎంపీడీఓ కీర్తి తెలిపారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులకు అధికారులు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేస్తే మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ గత సమావేశాల్లో ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యలపై వివరణ ఇచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ-2 మంచాల ప్రియాంకరెడ్డిలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ బిల్లుల వసూలు సమయంలో అధికారులు తీరు సక్రమంగా లేదని, పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని మల్కాపురం సర్పంచి కోరారు. తాళ్లూరు-2 ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్ మాట్లాడుతూ పలు స్తంభాలు తుప్పపట్టి పాడై ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. బొద్దికూరపాడు సర్పంచి మందా శ్యామ్సన్ ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, లైన్లు మార్చాలని, అందుకు విద్యుత్ అధికారులు సహకరించాలని కోరారు. మన్నేపల్లి సర్పంచి మంచాల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాల వద్ద మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంఈఓ సుబ్బయ్య, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏఈ వీరబ్రహ్మం, వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ, వైద్యురాలు మౌనిక, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, ఏపీఓ మురళి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ

రావణ బ్రహ్మ వాహనంపై ఆది దంపతుల దర్శనం

మార్కాపురం టౌన్: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శివాలయంలో స్వామి వారు మంగళవారం రావణ బ్రహ్మ అలంకారంపై పార్వతీ పరమేశ్వరులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం రుద్రాభిషేకం, అమ్మవారికి అర్చన నిచేశారు. నాలుగు మాడ వీధుల్లో స్వామి వారి ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. శివాలయంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. చైర్మన్ వి.కేశవరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, గోపాలుని హరిహరరావు పాల్గొన్నారు.

